క్లుప్తంగా

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

చీమకుర్తి: సూపర్ స్టార్ కృష్ణ 80వ జయంతి వేడుకలను బుధవారం చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ చీమకుర్తి రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కృష్ణ జయంతిని పురస్కరించుకుని మోసగాళ్లకు మోసగాడు సినిమా రీ రిలీజ్ సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పమిడి వెంకటేశ్వర్లు తెలిపారు.

అటవీ శాఖలో బదిలీలు



గిద్దలూరు అటవీ శాఖ కార్యాలయం

గిద్దలూరు రూరల్: అటవీ శాఖలో ఉద్యోగుల బదిలీల సందడి నెలకొంది. జూన్ 2, 3వ తేదీల్లో బదీలల ఉత్తర్వులు ఉన్నతాధికారుల నుంచి అందనున్నాయి. గిద్దలూరు రేంజిలో గుంతపల్లె, తురిమెళ్ల రేంజి ఆరవీటికోట బీటు, బొల్లుపల్లె బీటు.. ఈ మూడు పోస్టుల్లో ఉండే ఎఫ్‌బీఓల కాలపరిమితి పూర్తి కావడంతో ఆయా బీట్లు ఖాళీలుగా ఏర్పడనున్నాయి. వాటి కోసం ఎఫ్‌బీఓలు 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవిగాక ఎప్పటి నుంచో తురిమెళ్ల రేంజిలో ఎఫ్‌బీఓ పోస్టు, వెలగలపాయ ఈస్ట్ బీటు, గిద్దలూరు రేంజిలో కొత్తకోట బీటుల్లో ఏబీఓలే ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. ఎక్కువ మంది కొత్తకోట బీటు పోస్టు కోసం పోటీ పడుతున్నారు. అటవీశాఖ ఉన్నతాధికారులకు నాయకుల నుంచి సిఫార్సు లేఖలను పెద్ద ఎత్తున తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. ఒక వైపు యూనియన్ నాయకుల సిఫార్సులు, మరో వైపు రాజకీయ నాయకుల సిఫార్సుల కోసం అటవీ శాఖలోని ఎఫ్‌బీఓలు పరుగులు తీస్తున్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట

ముండ్లమూరు: మండలంలోని పులిపాడు శివాలయం వద్ద విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అర్ధనారీశ్వరీ విగ్రహం, నందీశ్వరుడు, విఘ్నేశ్వరుడు, వినాయక, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను వేదపండితుల మంత్రోచ్ఛరణలతో వైభవంగా ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నదానం చేశారు.

అర్ధవీడు (కంభం): మండలంలోని పెద్ద కందుకూరు శ్రీ పట్టాభిరామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను విజయ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కామూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. నారు అశోక్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి



బస్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీ అభివృద్ధికి రాజీలేని కృషి చేస్తామని, కాలేజీకి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. రూ.30 లక్షల ఎంపీ లాడ్స్‌తో మెడికల్ కాలేజీకి ఏర్పాటు చేసిన బస్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ బస్సును కమ్యూనిటీ హెల్త్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు, గ్రామాలకు వైద్య విద్యార్థులు వెళ్లి పరిశీలించేందుకు ఉపయోగించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ మెడికల్ కాలేజి నుంచి భవిష్యత్తులో మంచి డాక్టర్లు సమాజానికి అందాలన్నారు. బ్లడ్ బ్యాంక్‌కు అవసరమైన రిఫ్రిజిరేటర్‌ను అందిస్తామన్నారు. ఎమ్మెల్యే, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ చైర్మన్ బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో అన్నీ సౌకర్యాలు అందుబాటులో ఉంచుతామన్నారు. దీనిలో మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ సాల్మాన్‌రాజు, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, ఆర్‌ఎంఓ చైతన్యవర్మ, డాక్టర్‌లు జీవన్, తిరుమలరావు, వార్డెన్‌లు ప్రదీప్, సుధారాణి పాల్గొన్నారు.

ఎంపీ మాగుంటను కలిసిన జూపూడి



ఎంపీ మాగుంటతో జూపూడి

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని స్థానిక ఆయన కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సామాజికన్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మర్యాదపూర్వకంగా ఎంపీని కలిసినట్లు జూపూడి తెలిపారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఎంపీ మాగుంటకు పోలవరం గ్రామస్తుల సత్కారం

తమ గ్రామంలోని డప్పు, చర్మ కళాకారులు 12 మందికి పెన్షన్ మంజూరు చేయించడం ఆనందంగా ఉందంటూ ముండ్లమూరు మండలం పోలవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని స్థానిక ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ గ్రామంలో పార్టీని బలోపేతం చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో కొర్రపాటి శ్రీనివాసరావు, పులి సంజీవ, వెంకటస్వామి, ఆంజనేయులు, ఓకియాలు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు బస్టాండ్‌కు శంకుస్థాపన



అల్లూరు బస్టాండ్‌కు శంకుస్థాపన చేస్తున్న నాయకులు, అధికారులు

అల్లూరు (కొత్తపట్నం): అల్లూరు గ్రామ ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బస్టాండ్ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన భూమి పూజా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఉపసర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఐపీ రామారావు, గ్రామస్తులు పాల్గొని టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ బస్‌షల్టర్ శిథిలావస్థకు చేరిందని, దాని స్థానంలో కొత్తది నిర్మించాలని ప్రజలు కోరారన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి ఎంపీ నిధులు రూ.5 లక్షలు మంజూరు చేయించారన్నారు. బస్‌షల్టర్ ఏర్పాటుతో ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివారెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు నానిరెడ్డి పేరారెడ్డి, శెట్టి రామచంద్రారెడ్డి, రామలింగారెడ్డి, హరిబాబు, వెంకారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

నాగులుప్పలపాడు: విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకురాలు నాగరజని సూచించారు. వేసవి గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం చిన్నారులతో నీతి కథలు, పుస్తక పఠనంతో పాటు క్రీడలు ఆడించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు మాట్లాడుతూ చిన్నతనం నుంచే పుస్తక పఠనం ద్వారా విషయ పరిజ్ఞానం అలవరుతుందన్నారు.

3న ఉచిత వైద్య శిబిరం

నాగులుప్పలపాడు: పాలపర్తి సత్యం మాస్టారు ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఈ నెల 3వ తేదీ ఉదయం 9 గంటలకు మండలంలోని మట్టిగుంట గ్రామంలో ఎలిమెంటరీ పాఠశాల ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు పాలపర్తి మనోజ్‌కుమార్ తెలిపారు. బాపట్ల విజయ హాస్పిటల్ వారిచే నిర్వహించే ఈ వైద్య శిబిరంలో చిన్న పిల్లలు, జనరల్ వైద్య నిపుణులు, ప్రసూతి వైద్యులు, జనరల్ సర్జన్ పాల్గొని పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు 3న భూమి పూజ

నాగులుప్పలపాడు: నాగులుప్పలపాడు బస్టాండ్ కూడలిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఈ నెల 3వ తేదీ భూమి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు విగ్రహ నిర్మాణ కమిటీ గౌరవాధ్యక్షుడు పాలడుగు విజయేంద్రబహుజన్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ హాజరవుతారని, మండలంలోని ప్రజానీకం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మోటార్ బైక్‌ను ఢీ కొట్టిన కారు

వేటపాలెం: వేగంగా వచ్చిన కారు మోటార్ బైక్‌ను ఢీ కొట్టిన సంఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్రగాయాల పాలయ్యాడు. వేటపాలెం బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద బుధవారం సంఘటన చోటు చేసుకుంది. వివరాలు గుంటూరు వైపు నుంచి ఒంగోలు వెళుతున్న కారు అదే సమయంలో చల్లారెడ్డిపాలెం కొణిజేటి చేనేతపురి కాలనీకి చెందిన బట్టా అయ్యప్ప మోటార్ బైక్ పై చీరాల వైపు వెళుతున్నాడు. ఎదురుగా వచ్చిన కారు మోటార్ బైక్‌ను ఢీ కొట్టడంతో బైక్ నడుతున్న వ్యక్తి ఎగిరి రోడ్డు పక్కన మార్జిన్‌లో పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు తరలించారు. ఎస్సై జి. సురేష్ పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

బల్లికురవ: మండలంలోని వేమవరంలో కులంపేరుతో దూషించిన ఘటనపై బుధవారం బాపట్ల డీఎస్పీ టి. వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. ఏప్రిల్ 8న గ్రామానికి చెందిన ఒడిస్సా తిరుపతి నాయక్ గ్రానైట్ డస్ట్ పోసుకుని గ్రామంలోకి వెళుతుండగా ఉమామహేశ్వరరావు.. నాయక్‌ను కులం పేరుతో దూషించి దుర్భాషలాడిన ఘటనపై కేసు నమోదైంది. డీఎస్పీ ఘటనా ప్రదేశం, గ్రామం, కాలనీలో విచారణ చేపట్టారు. 2017లో జరిగిన జంట హత్యలకు సంబంధించి గ్రామంలో జరుగుతున్న పోలీస్ పికెటింగ్ పరిశీలించారు. సీఐ ప్రభాకర్, బల్లికురవ ఎస్సై వి. వేమన పాల్గొన్నారు.

బైక్ పై నుంచి పడి వ్యక్తికి గాయాలు

అద్దంకి: కుక్క అడ్డు రావడంతో బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చక్రాయపాలెం అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలో బుధవారం జరిగింది. అందిన సమాచారం మేరకు గుజరాత్‌కు చెందిన సయ్యద్‌సాట్ ఒంగోలులో కంపెనీలో పని చేస్తుంటాడు. ఈ క్రమంలో అతను బుధవారం బైక్‌పై హైదరాబాద్ బయలుదేరాడు. చక్రాయపాలెం సమీపంలోకి రాగానే కుక్క అడ్డురావడంతో బైకు అదుపు తప్పింది. దీంతో కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది క్షతగాత్రుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ధర్నా జయప్రదం చేయండి

అద్దంకి రూరల్: ఉపాధి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం చెరుకుంపాలెంలో ఉపాధి కార్మికుల పర్యటనలో భాగంగా ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు.

మాగుంట, శిద్దా ఆశీర్వాదం తీసుకున్న వినూత్న





వినూత్నను సత్కరిస్తున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, శిద్దా రాఘవరావు

ఒంగోలు: ఐఏఎస్‌కు ఎంపికైన ఒంగోలు మహిళ బొల్లిపల్లి వినూత్న బుధవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావులను వారివారి నివాసాల్లో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. గొప్ప ఆశయంతో ఉన్నత లక్ష్యాన్ని చేధించిన వినూత్నను వారు అభినందించారు. భవిష్యత్తులో విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఆమె వెంట తండ్రి రవికుమార్ ఉన్నారు.

పొగాకు ఉత్పత్తులు వాడరాదు



ర్యాలీలో ప్రసంగిస్తున్న డాక్టర్ ఆనందమోహన్

మద్దిపాడు: పొగాకు ఉత్పత్తులు వాడరాదని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఆనందమోహన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మద్దిపాడులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు వాడటం మూలంగా మానవ శరీరంలోని ప్రతి అవయవం చెడిపోతుందన్నారు. నేరుగా పొగాకు ఉత్పత్తులు నోట్లోకి తీసుకునే వారికి గొంతు, నాలుక క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు, గుండెజబ్బు, పక్షవాతం, నెమ్ము వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. పొగాకు ఉత్పత్తులు వాడే వారు చిన్న చిన్న పనులకే ఆయాసానికి గురవుతారన్నారు. ముఖ్యంగా మహిళల్లో సంతానోత్పత్తి సమస్యలు ఎక్కువగా వస్తాయన్నారు. అనంతరం వైద్య సిబ్బంది వారికి పరిచయం ఉన్న వ్యక్తులకు పొగాకు వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. పొగాకు ఉత్పత్తులు మానేసే విధంగా వారికి కౌన్సిలింగ్ ఇస్తామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ హనీఫ్, సీహెచ్‌వో లలితమ్మ, ఎంపీహెచ్‌ఈవో వెంకారెడ్డి, పీహెచ్‌ఎన్ రజితకుమారి, సూపర్‌వైజర్లు బాలకోటయ్య, నాగేశ్వరరావు, పద్మావతి, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



వైద్య సిబ్బందికి చీరలు పంపిణీ చేస్తున్న శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధీర్

- వైద్య సిబ్బందికి చీరల పంపిణీ

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి వివాహ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ హైస్కూళ్ల విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. కరోనా సమయంలో విశేష సేవలందించిన ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు చీరలు అందించారు. గోల్డెన్ గ్రానైట్ క్వారీలో అనారోగ్యంతో మృతి చెందిన తన్నీరు సులోచన కుటుంబానికి శిద్దా రాఘవరావు తన సొంత నిధులు రూ.4 లక్షలతో పాటు క్వారీ సిబ్బంది అందించిన మరో రూ.లక్ష కలిపి మొత్తం రూ.5 లక్షలు అందజేశారు. తొలుత శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి, వారి కుమారుడు శిద్దా సుధీర్, కుటుంబ సభ్యులు కలిసి హరిహరక్షేత్రంలో సకల దేవతలకు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. అనంతరం స్థానిక నాయకులు, గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ గిరి, క్వారీ సిబ్బంది, స్థానిక నాయకుల చేతుల మీదుగా గజమాలలతో శిద్దా రాఘవరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేయించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శిద్దా రాఘవరావు సోదరుడు పాండురంగారావు, కుటుంబ సభ్యులు, ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు, పలువురు గ్రానైట్ వ్యాపారులు పాల్గొన్నారు.

కేజీ రూ.204 పలికిన పొగాకు ధర

ఒంగోలు రూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రం–2లో బుధవారం నిర్వహించిన వేలంలో కేజీ పొగాకు గరిష్ఠ ధర రూ.204 పలికింది. వేలం కేంద్రానికి 784 బేళ్లు రాగా, 759 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 3 బేళ్లు నోబిడ్ అయ్యాయి. కేజీ కనిష్ట ధర రూ.180 పలకగా, సరాసరి ధర తొలిసారి రూ.200.07గా నమోదైనట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

ఘనంగా శ్రీగిరి బ్రహ్మోత్సవాలు



కూచిపూడి నృత్యంతో అలరిస్తున్న చిన్నారులు

ఒంగోలు టౌన్: పలుకే బంగారమాయెనా కోదండపాణి.. పలుకే బంగారమాయెనా... అంటూ పలువురు చిన్నారులు కూచిపూడి నృత్యంతో శ్రీగిరి నిలయునికి నృత్యాంజలి ఘటించారు. ఒంగోలు నగరంలోని కుర్తాళం సిద్దేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి వెంకటేశ్వరస్వామి త్రయాహ్నిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పరాంకుశం సీతారామాచార్యుల బృందం ఆధ్వర్యంలో యాగశాల పూజలు, విశేష స్నపన తిరుమాంజనం, పన్నీరు పుష్పాలతో సహస్రనామార్చన నిర్వహించారు. శేషవాహనారుడై ఉభయ దేవేరులతో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారిని చూసి భక్తులు పులకితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీనళినీప్రియ కూచిపూడి నృత్య నికేతన్ ప్రిన్సిపాల్ ఎన్వీ శివకుమారి ఆధ్వర్యంలో పలువురు చిన్నారుల నృత్యాలు మైమరిపించాయి. చూడ చక్కటి అభినయంతో కళాకారులు ఆకట్టుకున్నారు. భక్తుల కరతాళ ధ్వనులతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వేంకట రమణారావు, ఆర్జితసేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వాహక ధర్మకర్త సీవీ రామకృష్ణారావు కళాకారుల బృందాన్ని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు శ్రీవారి ఏకాంత సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి

- పద్మశాలీయుల సంఘ నాయకులు ఆగ్రహం



మాట్లాడుతున్న పద్మశాలీయుల సంఘ నాయకులు

చీమకుర్తి: విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా చీమకుర్తిలో ఒక నిండు ప్రాణం పోయిందని పద్మశాలీయుల సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం చీమకుర్తిలోని చేనేత సొసైటీ కార్యాలయ ఆవరణలో సంఘ నాయకుడు చింతకింది అశోక్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. చీమకుర్తిలోని చింతగింజల వారివీధిలో బుధవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో ఏసీ కాలిపోయి పొగలు వచ్చి విషవాయువులతో జిల్లాపరిషత్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్న దొంతు శ్రీదేవి మృతి చెందినట్లు తెలిపారు. అంతేగాకుండా ఆమె కుమారుడు సాయితేజ కూడా ఆస్పత్రిలో ప్రమాదకర స్థితిలో ఉన్నాడన్నారు. చింతకిందివారి బజారుతో పాటు చుట్టుపక్కల లోఓల్టేజీ కారణంగా ఇళ్లలో ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోతున్నాయని ఇప్పటికే అనేకసార్లు విద్యుత్‌శాఖాధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తీరా ప్రాణ నష్టం జరిగిన తర్వాత బుధవారం సాయంత్రం లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారని చెప్పారు. లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి ముందుగానే చర్యలు చేపడితే ప్రాణం పోకుండా ఉండేదంటూ పద్మశాలీయ సంఘ నాయకులు మర్రి లక్ష్మీనారాయణ, కడవా రామకృష్ణ, దొంతు వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీదేవి కుటుంబాన్ని విద్యుత్ శాఖ ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బెట్టింగ్‌తో అప్పులపాలై వ్యక్తి ఆత్మహత్య

ఒంగోలు టౌన్: మద్యానికి బానిస కావడంతో పాటు క్రికెట్ బెట్టింగ్‌ల కారణంగా అప్పులపాలైన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం... గుంటూరుకు చెందిన కోటా రామకృష్ణ చిలకలూరిపేటలోని ఒక ఎలక్ట్రానిక్ షాపులో ప్రముఖ సెల్‌ఫోన్ కంపెనీ తరపున సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. క్రికెట్ బెట్టింగ్‌ల కారణంగా అప్పులపాలై గుంటూరులోని ఇంటిని కూడా అమ్మేసుకున్నాడు. తద్వారా వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చి కాపురాన్ని చిలకలూరిపేటకు మార్చాడు. కొద్దిరోజుల పాటు బుద్ధిగా ఉద్యోగం చేసుకున్న అతను.. తిరిగి బెట్టింగ్‌లు కాయడం, డబ్బు నష్టపోవడంతో పాటు మద్యానికి బానిసయ్యాడు. మళ్లీ అప్పులు కావడంతో తీర్చే దారిలేక ఆత్మహత్య చేసుకున్నాడు. గత మంగళవారం గుంటూరు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన రామకృష్ణ.. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత భార్య మాధురికి ఫోన్ చేసి నావల్ల మీరంతా బాధపడుతున్నారు, నన్ను క్షమించండి, ఆత్మహత్య చేసుకుంటున్నా అని చెప్పాడు. వెంటనే మాధురి చిలకలూరిపేట పోలీసు స్టేషన్లో తెలుపగా, వారు రామకృష్ణ ఫోన్ నంబర్‌ను ట్రేస్ చేసి ఒంగోలులో ఉన్నట్టు చెప్పారు. ఒంగోలు వచ్చి ఇక్కడ ఉండే బంధువు మోహన్‌రావు సహాయంతో గాలించినా కనిపించలేదు. బుధవారం ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఒక లాడ్జిలో గదిలో ఉరి వేసుకుని మరణించినట్టు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.